క్లుప్తంగా

పౌరాణిక రంగస్థల నటుడు ఆరాధ్యులకు ఘనసత్కారం



తెనాలి: శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా కఠెవరం గ్రామంలో సోమవారం రాత్రి పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శించారు. ఇదే వేదికపై తెనాలికి చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఆరాధ్యుల ఆదినారాయణకు ఇటీవల డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆయన్ను పూల మాలలు, దుశ్శాలువతో సత్కరించారు. భవానీ శంకరుడి పాత్రలో తనకు శిక్షణనిచ్చి తీర్చిదిద్దిన గురువు ఆదినారాయణకు ఆయన శిష్యుడు తాడిబోయిన నాగేశ్వరరావు బంగారు ఉంగరం బహూకరించారు. డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం సన్మానపత్రం రాసి స్వయంగా అందజేశారు. బ్రహ్మంగారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సత్కారంలో నటులు ఫణి కుమార్, కుమార్ బాబు, రామలింగేశ్వరరావు, సంగమేశ్వర వేంకటేశ్వరరావు, గంపల శివనాగేశ్వరరావు, దూళ్ల అప్పయ్య, సూర్యం, వందనం తదితరులు ఆదినారాయణ కళారంగ సేవలను కొనియాడారు.

నెహ్రూనికేతన్‌కు ఉత్తమ పాఠశాల పురస్కారం



తెనాలిఅర్బన్: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలను జాతీయ స్థాయిలో ఏడావ ఉత్తమ పాఠశాల పురస్కారానికి లీడ్ స్కూల్ నిర్వాహకులు ఎంపిక చేశారని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్‌లు తెలిపారు. స్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లీడ్ స్కూల్ వారు జూన్‌లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని లీడ్ స్కూల్ వ్యవస్థాపకులు సుమిత్ మెహతా, కో-సీఈవో సుమిత్ దేవ్‌రాహ్‌లు అందజేయనున్నట్లు చెప్పారు. దేశంలో లీడ్ స్కూల్ కరికులంను అమలు చేస్తున్న మూడు వేల పాఠశాలల్లో తమ పాఠశాల ఒకటని తెలిపారు. తమ పాఠశాల ఉత్తమ పురస్కారానికి ఎంపిక కావటం సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలు మరువరానివని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన నేత రాజీవ్ గాంధీ అని చెప్పారు. దేశంలో అనేక నూతన సంస్కరణలకు నాంది పలికారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని చెప్పారు. నేటి బీజేపీ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని ఆరోపించారు. ఇందిరమ్మ పాలన ఇంటింటికీ సౌభాగ్యమని, తల్లి బాటలో ఆయన నడిచారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లియ్య, నాయకులు యన్నంశెట్టి శివరామ కృష్ణప్రసాద్, పి.శివ కుమార్, పి.స్టీవెన్ బాబు, టి.శివన్నారాయణ, బి రమేష్, షేక్ మాబు, ఏ కృష్ణ, కే కోటేశ్వరరావు, ఎస్ సుబ్బారావు, బి శ్రీను, కే వీర స్వామి, ఎస్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దొండపాడులో యువకుడి మృతదేహం లభ్యం



తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో ఒక యువకుడు శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం యండ్రాయి గ్రామానికి చెందిన ఎస్.మధుసూదన్ రాజు సోమవారం ఉదయం ఇంటి వద్ద సచివాలయంలో పని ఉందంటూ బయటకు వచ్చాడు. తుళ్లూరు మండలం దొండపాడు పరిసర ప్రాంతాల్లో మద్యం సేవిస్తూ స్థానికులకు కనిపించి రాత్రికి శవంగా మారాడు. స్థానిక వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారుల సృజనకు పదును

- ఉచిత వేసవి శిక్షణ శిబిరం
- కన్నెగంటి ఫౌండేషన్ నిర్వహణ



కర్ణాటక సంగీత శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు



నృత్యశిక్షణలో చిన్నారులు

తెనాలి: వేసవి సెలవులు బడి చదువులకు విరామం... పిల్లలకు ఆటవిడుపు. ఆ రోజుల్లోనే కేవలం ఆటలకే పరిమితం కాకుండా తమ పిల్లల సృజనను పదును పెట్టేందుకుదారులు వెతుకుతుంటారు తల్లిదండ్రులు. కొంచెం అవగాహన కలిగిన పిల్లలు కూడా ఏదో ఒకటి నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. అలాంటి వారందరికీ పట్టణానికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ ఆశాదీపంలా కనిపిస్తోంది. తెలుగు, సంస్కృతం భాషలు, కూచిపూడి నృత్యంతో సహా అరు అంశాల్లో ఏటా ఉచితంగా శిక్షణనిస్తోంది.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంతో కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణాదేవి ఫౌండేషన్ 2005లో ఆవిర్భవించింది. అప్పటి నుంచి కరోనా విపత్కర పరిస్థితులు మినహా ప్రతి వేసవి సెలవుల్లోనూ దాదాపు 45 రోజులపాటు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. స్థానిక హిందీ ప్రేమీ మండలి వేదికగా తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, యోగ, చిత్రలేఖనం, తెలుగు, సంస్కృతంలో శిక్షణ నిస్తున్నారు. ఆయా అంశాల్లో ప్రముఖులైన సుజాత, బి.రంగనాయకి, లావణ్య, సాంబశివరావు, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి తదితరులచే శిక్షణను ఇప్పిస్తున్నారు. ఒక్కో చిన్నారి ఒకటికి రెండు మూడు అంశాల్లో శిక్షణ తీసుకుంటున్నారు.

ఆరంభం నుంచి ఇక్కడ వివిధ అంశాల్లో శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాఠశాలల్లో, కాలేజీల్లో ప్రదర్శనలివ్వటం చేస్తున్నారు. బేసిక్స్ నేర్చుకున్న చిన్నారులు, తర్వాతి కాలంలో మరింతగా శిక్షణ తీసుకుంటూ రాణిస్తున్నారని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కన్నెగంటి రామరాయచౌదరి వెల్లడించారు. శిక్షణ శిబిరంలో స్థానికులే కాకుండా సెలవులకు తాత, నానమ్మల ఇళ్లకు వచ్చిన చిన్నారులు కూడా ఇక్కడ వివిధ అంశాలను నేర్చుకోవటం విశేషం! వీటితోపాటు క్రమశిక్షణగా మెలగటం, తల్లిదండ్రులపై ప్రేమగా ఉండటం, పెద్దలను గౌరవించటం కూడా అలవరుస్తున్నారు.

ఆరు అంశాలను నేర్చుకుంటున్నాం



మేం నాలుగో తరగతి పూర్తిచేశాం. ఇక్కడ ఆరు అంశాల్లోనూ శిక్షణ తీసుకుంటున్నాం. కూచిపూడి నృత్యంలో స్టేజీ ప్రదర్శనలు ఇచ్చాం. కూచిపూడితో ఇతర అంశాలను నేర్చుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– ఎస్.శశిక, షేక్ లితానిఖత్

సెలవులు సద్వినియోగం



మాది హైదరాబాద్. నేనూ తమ్ముడు జయవర్ధన్, చెల్లెలు హంసిత కలిసి వేసవి సెలవులకు ఇక్కడ బంధువుల ఇంటికి వచ్చాం. ఖాళీగా ఉండటం ఎందుకని శిక్షణ శిబిరంలో చేరాం. అన్ని అంశాల్లో శిక్షణ తీసుకుంటున్నాం.

– జీఎస్ఎస్ గోవర్ధన్

ఏడాదిపాటూ శిక్షణ ఇస్తాం



వేసవి శిబిరంతోనే సరిపెట్టకుండా మా తండ్రి కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి శతజయంతి సందర్భంగా కంప్యూటర్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌తో సహా పాఠశాల చదువు నుండి ఇంజినీరింగ్ వరకు ఏ సబ్జెక్టులోనైనా కనీసం 15 మంది ముందుకు వస్తే వారికి ఆయా సబ్జెక్టులో ఏడాది మొత్తం ఉచిత శిక్షణనిస్తాం. అలా ఎన్ని బ్యాచ్‌లు వచ్చినా, అందరికీ వారు కోరిన సబ్జెక్టుల్లో నిపుణులైన అధ్యాపకులను నియమించి, సహకరిస్తాం.

– కన్నెగంటి రామరాయ చౌదరి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

హాస్టల్ సదుపాయానికై దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ ఇతర కోర్సులను చదువుతున్న ఆర్యవైశ్య విద్యార్థులకు తెనాలిలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగానమ్మపేటలోని వైశ్య విద్యానిధి హాస్టల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఇస్తున్నట్లు చెప్పారు. తెనాలి, పరిసర ప్రాంత, ఇతర జిల్లాల వాసులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు హాస్టల్‌లో సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి అన్నమయ్య పురస్కారం

తెనాలిరూరల్: మండల గ్రామం కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి అన్నమయ్య పురస్కారానికి ఎంపికయ్యారు. చిత్తూరుజిల్లా బైరెడ్డిపల్లి మండలం గొల్లచీమన గ్రామానికి చెందిన ఆంధ్ర కళల పరిరక్షణ సమితి, ఏఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషకు, కళారంగానికి, నృత్య, సంగీత రంగాలకు సేవలు అందించిన వారికి ఈ నెల 26న పురస్కారాలు అందజేయనున్నారు. ఈ క్రమంలో ప్రజ్ఞాచారిని అన్నమయ్య పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు ఆంధ్ర కళల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మెడవలి చిరంజీవి మంగళవారం తెలిపారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి



చినరావూరుతోటలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



లింగారావు సెంటరులో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న టూటౌన్ పోలీసులు

తెనాలిరూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. స్థానిక చినరావూరుతోట, వైకుంఠపురం కాలువ కట్ట ప్రాంతాల్లో వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రూట్ మార్చ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రూట్ మార్చ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేసినట్టు వన్‌టౌన్ సీఐ జి. దశరథ రామారావు తెలిపారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో కలిసి రూట్ మార్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేని ఎనిమిది వాహనాలు సీజ్ చేసినట్టు తెలిపారు.

అదే విధంగా సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా టూ టౌన్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్ ఆధ్వర్యంలో ఐతానగర్ పరిధిలోని లింగారావు సెంటర్, భాస్కరరావు దిబ్బ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు. టూ టౌన్ పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు ప్రత్యేక సాయుధ బలగాలు పాల్గొన్నారు.

టూటౌన్ పరిధిలో తనిఖీలు

తెనాలిరూరల్: తెనాలి టూ టౌన్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్థానిక నందులపేట శివారు భాస్కరావుదిబ్బలో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అలానే సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ ఎ. సుధాకర్ తెలిపారు.

మేధాశక్తిని పెంపొందించేందుకే సమ్మర్ క్యాంప్



మాట్లాడుతున్న కె.జాన్సీలత

కొల్లిపర: విద్యార్థులు వేసవి సెలవుల్లో కాలాన్ని వృథా చేయకుండా వారిలో మేధాశక్తిని పెంపొందించేందుకే గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపును నిర్వహించటం జరుగుతుందని ఎంఈవో కె.జాన్సీలత సూచించారు. మంగళవారం గుడిబండివారిపాలెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సమయం వృథా చేయకుండా చదువుకోవటం వలన కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు, రీసోర్స్ పర్సన్ ఎ.స్రవంతి, సీఆర్‌పి పి.రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మెల్లెంపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఓ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై తాడేపల్లి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి రూరల్ పెదవడ్లపూడికి చెందిన గంటా శ్రీనివాసరావు, చిట్టెమ్మ దంపతుల ఏకైక కుమారుడు శ్రీకాంత్ (25) బీటెక్ పూర్తిచేసి వ్యవసాయం మీద మక్కువతో అదే గ్రామంలో వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీన తన సెల్‌ఫోన్ రిపేర్ నిమిత్తం స్నేహితుడైన వినయ్‌కుమార్‌తో కలసి ద్విచక్ర వాహనంపై మెల్లెంపూడి మీదుగా విజయవాడ వెళ్తుండగా లంబాడీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో బండి వెనుక కూర్చున్న శ్రీకాంత్ పైకి ఎగిరి కింద పడడంతో తలకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గంటా శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

తగలబడ్డ కేబుల్ వైర్లు



తగలబడుతున్న విద్యుత్ స్తంభానికున్న వైర్లు

తెనాలి: పట్టణంలో కేబుల్ టీవీలకు తోడు రకరకాల ఇంటర్‌నెట్ సర్వీసులు రంగప్రవేశం చేశాయి. వీటి లైన్ల కోసం విద్యుత్ స్తంభాలను వినియోగిస్తుండటం తెలిసిందే. రకరకాల వైర్లు, కేబుల్స్ విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోతున్నాయి. విద్యుదాఘాతంతో అప్పుడప్పుడు అగ్నిప్రమాదాలు జరుగుతుండటం పరిపాటైంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో నాజరుపేటలో ఇదే తరహా ప్రమాదం జరిగింది. చెరువువారి వీధి, పులిపాకవారి వీధి మలుపులో గల స్తంభానికి అగ్నిప్రమాదం సంభవించింది. దిగువ నుంచి పైవరకు వున్న కేబుల్ వైర్లు, ఇంటర్నెట్ వైర్లు అన్నీ తగులబడి పోతుండటాన్ని నిద్రలో ఉన్న స్థానికులు గమనించారు. వీరు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ డీ1 ఏఈకి దుర్గారావు స్పందించి, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. స్థానికులు అప్రమత్తం కాకపోతే మంటల సమీప గృహాలకు వ్యాపించేవని చెబుతున్నారు. పట్టణంలో ఇలాంటి ప్రమాదాలు జరగటం ఇది ఆరోసారని తెలిసింది.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి జయంతి



పంచామృత అభిషేకంలో పరశివానంద భారతి, చైర్‌పర్సన్ రాధిక తదితరులు



హారతిని స్వీకరిస్తున్న భక్తులు

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి జయంతి వ్రతం, పంచామృత అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీపరశివానంద భారతి స్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాన్ని కన్నుల పండువగా జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, కె.శివరామిరెడ్డి, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, విజయకుమారి, భార్గవ్ పర్యవేక్షించారు. జూన్ ఒకటో తేదీన శ్రీహనుమత్ జయంతి సందర్భంగా అభయ వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన ఉంటాయని చంద్రశేఖరరెడ్డి తెలిపారు. జూన్ అయిదో తేదీన శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నసమారాధన ఉంటాయని, భక్తులు విచ్చేసి పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. స్వామివారి పంచామృత అభిషేకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక-రమేష్ దంపతులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, వివిధ రంగాల ముఖ్యులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

కరస్పాండెంట్ సుధాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ సుధాకర్

తెనాలిఅర్బన్: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ సూచించారు. నన్నపనేని వెంకట్రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ పార్టీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు ప్రయత్నించాలని చెప్పారు. విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు.నేటి సమాజంలో ఇంజినీరింగ్ విద్యకు ఉద్యోగావకాశాలు ఎక్కువని తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఎక్కువ మంది ఇతర దేశాలకు వెళ్లి స్థిర పడుతున్నారని, ఇది మంచి పరిణామమని చెప్పారు. అయితే మన దేశానికి అవసరమైన సమయంలో సేవలు అందించేందుకు అందరు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కడ ఉన్నా మన ప్రాంత గౌరవాన్ని మరింత ఇనుమడింపజేశాలా జీవించాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని తెలిపారు. అందరు ఉన్నత స్థానంలో ఉండాలని అభిలషించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీబీఎస్ అజయ్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌తో దేశసేవ చేసే అవకాశం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, వేదికపై ఎం.కళాధర్, ఆర్గనైజేషన్ కో-ఆర్డినేటర్స్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ పాలనా రంగంలో రాజకీయ వ్యవస్థలకు భిన్నంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల ద్వారా లభిస్తుందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. కె.వి.ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పది రోజుల ఐఏఎస్ ఫౌండేషన్ అవగాహన తరగతులు స్థానిక బ్రాడీపేట యూటీఎఫ్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ భిన్న సంస్కృతులు, ఆర్థిక సామాజిక అసమానతలను తగ్గించేందుకు అధికారులుగా ఐఏఎస్‌లకు తమపాలన ద్వారా ప్రత్యేక పాత్ర ఉంటుందన్నారు. ఒక జిల్లా కలెక్టర్ తన పాలనలో ఆ జిల్లా రూపురేఖలను మార్చే అవకాశం హెచ్చుగా ఉంటుందని తెలిపారు. రాజకీయ అధికారాలు కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటాయని సివిల్ సర్వెంట్స్ మూడు దశాబ్దాలకు పైగా దేశ సేవలో పని చేసే అవకాశం రాజ్యాంగం కల్పిస్తున్నదన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే సర్వీస్ కమిషన్ రాష్ట్ర అధికారులు పనిచేస్తారని జాతీయస్థాయిలో సివిల్ సర్వీస్ కమిషన్ ద్వారా దేశ విదేశాలలో సేవ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సన్ ఆర్గనైజేషన్ కో-ఆర్డినేటర్స్ ఆశిష్, హరీష్, సంధ్యలు మాట్లాడుతూ గత దశాబ్ద కాలం పైగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు సహకారంతో సన్ ఆర్గనైజేషన్ విద్యార్థుల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ జనవిజ్ఞాన వేదిక నాయకులు సత్యనారాయణ ప్రసాద్, టీఆర్ రమేష్, సుబ్బారాయుడు, అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వంతోనే అభివృద్ధి

ఫిరంగిపురం: సామాజిక సమానత్వంతోనే అభివృద్ధి సాధ్యమని సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మండల కేంద్రంలో నీడైస్ కోచింగ్ సెంటర్లో మంగళవారం బుద్ధజయంతి నిర్వహించారు. ఈసందర్భంగా బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని 200 దేశాలలో బుద్ధుడి జయంతిని నిర్వహిస్తున్నారని చెప్పారు. బుద్ధ భగవానుడి బోధనలకు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆకర్షితుడయ్యాడని తెలిపారు.

రాజ్యాంగంలోని సమానత్వం, గణతంత్రం, ప్రాథమిక సూత్రాలు, హక్కులు, విధులు వీటిలో భాగమేనని చెప్పారు. కార్యక్రమంలో టి.వీరయ్య, టి.ప్రసాద్, ఆర్.ప్రసాద్, బాబురావు, కాకి రామారావులు పాల్గొన్నారు.

నిడుముక్కలలో పోలీసుల కార్డన్ సెర్చ్

వివాదాస్పద వ్యక్తులు, అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో విస్తృత సోదాలు



నిడుముక్కల(తాడికొండ): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. సీఐ సీహెచ్ ప్రభాకర్, సిబ్బంది ఆధ్వర్యంలో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఇళ్లలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. వివాదాస్పద వ్యక్తులు, పాతకేసుల్లో నిందితులు, రౌడీ షీటర్లు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అదేవిధంగా లాం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కౌంటింగ్ రోజున సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐలు అంజయ్య, రవీంద్ర బాబు పలువురు సిబ్బంది ఉన్నారు.

అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న డాక్టర్ సి.సంధ్యారాణి

కొల్లిపర: రైతులు ప్రతి పంటల్లో వ్యవసాయాధికారుల సూచనలు మేరకు ఏఏ పంటలు సాగు చేయాలి, ఎరువులు ఎంత మోతాదులో వాడాలి అన్న అంశాలను తెలుసుకుని పాటించటం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించటం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సి.సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం పై రైతులకు , రావెప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.సంధ్యారాణి, ప్రొఫెసర్ సువర్ణలత సేంద్రియ వ్యవసాయం, జాతీయ సేవా పథకంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు కొల్లిపర గ్రామంలో వివిధ గృహాలను సందర్శించి సామాజిక ఆర్థిక నివేదికలను సేకరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కిషోర్‌బాబు, టీటీటీ వెంకట రాములు, అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ట్రెజరర్ బి.ప్రభాకర్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అవుతు కృష్ణారెడ్డి, ఏవో కె.వెంకటరావు పాల్గొన్నారు.